వ్యాఖ్యాన
సమాలోచనం

**Interpretive**
**Literary Criticism**

# సృజన చేతన
# రామాయణ కల్పవృక్షం

**రెండో భాగం**

**మాదిరాజు రంగారావు**

2009
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

**Interpretive**
**Literary Criticism**
**SRUJANA CHETANA**
**Ramayana Kalpa Vriksham**
Telugu
by
**Prof. Madiraju Ranga Rao**

© Dr. M. Santhosh Kumar

Y. P. 2009

Price Rs. **Five Only**

Published by
Rasadhuni Sahithi Parishath
Shantinagar, Hyderabad - 500 028.

For Copies
Navodaya Book House
Kachiguda, Hyderabad - 27.

Printed at
Anupama Printers,
Shanthi Nagar,
Hyderabad - 28.

*Presented*
to
my second daughter
***Dr. M. CHARITHA***
Research Scientist
Sandiego
California U.S.A
with
affection & blessings

## సూచిక

1. సమ ప్రసార రూపం
తాత్త్విక ప్రకాశం....................05
2. లోక హిత ధర్మం
కైకేయి అంతర్ వ్యక్తిత్వం......14
3. హంస ప్రవేశం
సంశయం – నిస్సంశయం....20

# 1. సమ ప్రసార రూపం
# తాత్త్విక ప్రకాశం

రామాయణ కల్పవృక్షం గురించి కృతి కర్త 'ఇది వాల్మీకి రామాయణానికి వ్యాఖ్యానమ'న్న అభిప్రాయం ఒకటి, గమనించదగింది, ఈ కోణంలో విలోకిస్తే విశ్వనాథ వ్యాఖ్యాన విశిష్టమయిన వాటిలో మూడు కథా విషయ కేంద్ర స్థానాలు చాలా ప్రాధాన్యం కలిగినవిగా కనిపిస్తాయి. ఇవి స్వతంత్రమయిన సృజన రూపాల్ని పొందినవీ. మహా కావ్య నిర్మాణ రూపంలో కీలక మయినవిగా వివేచనలో నిలుస్తాయి. 1) బాల కాండలో, రామునిలో మొదటిసారి కలిగిన తాత్త్విక చింతనలో వైరాగ్య భావన, 2) అయోధ్య కాండలో రాముని సమాధి స్థితిలో దేవతలు కనిపించి ఇచ్చిన మాటను గుర్తు చేయడం, దీనికి కైక సహకారం – ఆమె అంతర్వ్యక్తిత్వం, 3) యుద్ధ కాండలో హంస ప్రవేశంతో రావణునిలో సంశయం – యుద్ధం చివరి ఘట్టంలో నిస్సంశయానికి దారి తీయడం. విష్ణువూ దేవి శివుడూ కలిసిన శక్తి తేజో రూపంలో దివ్య భావన అనేవి. ఈ మూడు ప్రధాన కథలో అంశాలూ ఒకే తాత్త్విక సూత్రం పయి నిర్వహణ శిల్పాన్ని పొందాయి. మహా కావ్యంలో కవిత్వకళతో వ్యాఖ్యాన సుందరంగా ప్రకాశించాయి. అందువల్ల వీటిని గురించి అన్వయం వివరణం వివేచనంతో వ్యాఖ్యాన కోణంలో సమాలోచనం ప్రత్యేకతను పొందుతూంది. ఇలాంటి కీలకమయిన స్థానాలు ఏ మహా కావ్య మయినా చాలా తక్కువగా ఉంటాయి. అక్కడక్కడా రచనలో సందర్భానికి తగిన విధంగా తాత్త్వికమైన వివరణం చోటు చేసుకోవచ్చు. ఇలాంటివి చాలా చోట్ల తటస్థపడతాయి. ఈ విధం వేరు. ప్రస్తుతం ప్రధానమయిన కథా విషయం పయి పాత్ర ప్రవర్తనం పయి లక్ష్యం పయి ప్రభావం నెరపే గుణాన్ని కలిగింది. ఈ మూడు భాగాలూ అంతస్సూత్రంగా ప్రయోజనైక్యత కలిగినవి. కావ్య నిర్మాణ మార్మికతనూ పాత్రల అంతర్గుణాల్నీ లౌకికానికి భిన్నమైన ప్రయోజనాన్నీ భావింప జేస్తాయి. కావ్యంలో విషయానికి వైశాల్యాన్నీ గభీరతనూ ఔన్నత్యాన్ని కలిగించడమూ గమనించవచ్చు. కావ్యంలో తాత్త్వికత దేనికి సంబంధించింది అయినా అంతర్నిహితంగా అంతర్గర్భితంగా ఉండడం అవసరం.

మొత్తం మీద కవిత్వ కళను కప్పేయ కూడదు. కవి తన కృతిని గురించి మహర్షి వాల్మీకి హృదయానికి వ్యాఖ్యాన మన్న మాట వర్తించే అంశాల్లో ఇదొక పార్శ్వం మాత్రమే. ఈ పార్శ్వం కల్పవృక్షంలో కావ్య సౌందర్యంతో అర్థాంతర స్ఫూర్తి విశేషంగా విలసిత మయింది. కవి దృష్టిని బట్టి వ్యాఖ్యాన సమాలోచనం అవసరమవుతుంది.

## II

బాల కాండలో సీతా రాముల కల్యాణానికీ పట్టాభిషేకానికీ మధ్య కొంత కాలం గడచింది. ఇది దంపతుల ప్రణయానురాగ సమర్పకంగా కథా భాగం నడచింది. వాల్మీకి రామాయణంలో బాల కాండ 77 వసర్గలో అయిదు శ్లోకాల్లో వారి రూప గుణ వర్తన విశేషాలతో ఒకరి పట్ల మరొకరికి ప్రేమాతిశయం వర్ణిత మయింది. ఇది లౌకికమయిన అంశాల్ని స్పృశిస్తూ దివ్యమయిన భావనా మయ మయింది. మహర్షి ఆదర్శ గుణ సంకల్పం మనోహర మయిన కవితాకృతిని పొందింది.

"రామస్తు సీతయా సార్థం విజహార బహూన్ ఋతూన్
మనస్వీ తద్గత స్తస్య నిత్యం హృది సమర్పితః"     (శ్లో – 28)

ఉదాత్తమయిన మనస్సు కలిగిన ఉత్తమ గుణాలు కలిగిన రాముని హృదయంలో సీత ఎల్లప్పుడూ నెలకొనే ఉంది. ఆ దంపతులు పరస్పరానురాగంతో బహు ఋతువులు ఆనందంగా విహరించారు. వాల్మీకంలోని ప్రణయ విహరణం మరియు బహు ఋతువుల ఆగమనం – ప్రేరణతో కల్పవృక్షంలో నూట ఇరవై పైగా పద్యాల్లో సువివృతిని పొందింది. ఆరు ఋతువుల నేపథ్యంలో ప్రణయ చిత్రణం స్వతంత్ర మయిన కావ్య భాగంగా వెలసింది. ఋతువుల వర్ణనం ప్రకృతికి మాత్రమే పరిమితం కాలేదు.

కథలో స్థితి రూపం పాత్రల వర్తనం అనుభూతి ప్రకాశంతో రూపొందింది. ఆయా ఋతువుల్లో మార్పులతో స్థితి చలనంపై పాత్రల మానసికతపై ప్రభావంతో రచన, వాస్తవ జీవితంతో పాటు కాల్పనిక సుందరతనూ పొందింది. పాత్రల మానసిక రీతుల కనుగుణంగా అంతర్బహిః కారణాల పరియోజనంతో వ్యాఖ్యాన విశేషమూ



చోటు చేసుకుంది. ఈ సన్నివేశాలు చాలా పరిమితంగానే కాక బహు సంగ్రహంగానూ వెలసాయి. వీటిని తాత్త్విక పార్శ్వంగానూ గుర్తించి సమాలోచనం జరపడానికెంతో అవకాశం ఉంది.

కల్యాణం తరువాత సీతా రాముల జీవితం కొంత కాలం ప్రేమానురాగ విహరణంతో గడచింది. ఆరు ఋతువులూ ఒక దాని తరువాత మరొకటి "కల్పనావధి" (ఖండాంతంలో పద్యం 297)గా రూపొందాయి. ఈ విశేష సూచన అన్వర్థంగానూ ఉంది. కొత్త దంపతుల అనురాగ మనో విభవంతో అనుభూతి సాంద్రమయిన కాల్పనిక రామణీయకత దీని ప్రత్యేకత. మూలంలో ఈ సందర్భంలో

"దేవతాభిస్సమా రూపేణ సీతా శ్రీరివ రూపిణీ"
సౌందర్యంలో దేవతా స్త్రీ వలె స్వరూపంలో లక్ష్మీదేవి వలె సీత శోభిల్లింది.

"శుశుభే రామః శ్రియా విష్ణురివ", లక్ష్మిచేత విష్ణువు వలె రాముడు శోభిల్లాడు. లోకోత్తర మయిన భావ రూపాలతో రచన దర్శన మిస్తుంది. వాల్మీకంలో సీత హృదయంలో రాముడూ, రాముని హృదయంలో సీత పొందిన ఏకాకార ప్రేమ రూపం కల్పవృక్షంలో ఆరు ఋతువుల నేపథ్యంలో కావ్య కళను పొందింది. కవి సృజన చేతనలో విశిష్టమయిందిగానూ ఉంది.

కల్పవృక్షంలో ఈ భాగంలో మొదటిసారిగా రామునిలో ద్విధా ప్రవృత్తి బహిర్గత మయింది. మొదటిది సీతా ప్రేమమయ మయిన "సంసార" భావన. రెండోది జ్ఞాన మయ మయిన "వైరాగ్య"భావన. ఈ రెండూ కలిసి ప్రవహించే భావ ధార తో మనోరూపం వివేచన కందుతుంది. వివిధ సందర్భాల్లో ఏదీ మేరలు మీర కుండా సుస్థితికీ సమతకూ దారి తీసే విధమూ గమనించవచ్చు. ఇది 'గంగా యమున ప్రవాహాల విలీన రూపం"గా భావితమయింది. మొత్తం మీద తాత్త్విక పార్శ్వం వ్యాఖ్యాన సుందరత తో ప్రధాన పాత్ర వ్యక్తిత్వానికి బహుముఖీనతను చేకూరుస్తోంది. సంపూర్ణతకు దారి తీస్తుంది.

కాల దశల్ని చూపే ఋతువుల భ్రమణంలో గ్రీష్మం వచ్చింది. తాప భర రూపంతో రామునిలో తాత్త్విక ప్రపంచాన్ని అవతరింపజేసింది. ప్రకృతిలో దృశ్యాలు

మార్పులతో వైరాగ్య భావ రూపాలుగా కనిపించాయి. వ్యాఖ్యాన భాసురత కలిగిన తాత్త్విక పార్శ్వంలో ఇది మొదటిది. రామునిలో అనేక మయిన ప్రశ్నలు ఉదయించాయి. రాబోయే కథకూ భూమికగా సూచనగా మానసిక స్థాయిలోనూ అంతర్గతంగా కీలకమయిన పాత్రనూ రూపొందించాయి.

ఇలాంటివి ఈ కావ్యంలో చాలా పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. కథా వివృతికీ పాత్ర అంతర్వ్యక్తిత్వ నిర్మితికీ దోహదం చేస్తాయి. ఈ పార్శ్వం చర్చనూ ప్రోత్సహిస్తుంది. కొత్త ఆలోచనకూ ప్రేరేపిస్తుంది. దీని విశేషమేమంటే కథలో పైకి కనిపించని కారణాల యోజనతో అదృశ్య శక్తుల్ని గుర్తించడంతో, కథలో దాగిన లేదా అణగిన మనో రూపాన్ని సూచించడంతో వ్యాఖ్యానానికి కావ్యాంతర్గత మయిన గౌరవం లభిస్తుంది. ఇది కావ్య నిర్మాణంలో భాగమయి ఏకాకారాన్ని పొందడమనేది కవి ప్రతిభ పయి ఆధారపడి ఉంటుంది. వస్తువు - పాత్ర - లక్ష్యం - పై పట్టు ఉంటే తప్ప ఈ సంవిధానం చక్కగా సాధ్యం కాదు 1) గ్రీష్మంలో ప్రకృతి దృశ్యాలు ఎనిమిది పద్యాల్లోనూ 2) వీటి ప్రభావంతో రామునిలో ఉత్పన్న మయిన మౌలిక మయిన ప్రశ్నలతో చింతనా రూపం పన్నెండు పద్యాల్లోనూ, ఒకటి ప్రకృతి వర్ణనం రెండు తత్త్వ పరమయిన వ్యాఖ్యానంతో రచన ఆకర్షణీయంగా విలసిల్లింది.

## III

"పలుచని చివళ్ళెర్ర బడి వృక్షాగ్రముల్
కాషాయ శాటికాకార మొప్ప
పచ్చాకు దుల్లి లో పచ్చి యెండిన చెట్ల
మోళ్ళు దండాకారమున్ వహింప"

గ్రీష్మ ప్రభావంతో పూర్తిగా మారిన వాస్తవ దృశ్యాలతో ఆరంభ మయింది. చివుళ్ళు ఎర్రబడి చెట్ల చివరలు కాషాయ వస్త్రాకారాన్ని పొందాయి. పచ్చని ఆకు రాలింది. లోపలి పచ్చిదనం ఎండిపోయింది. ఆలాంటి చెట్ల మోళ్ళు దండాకారాన్ని వహించాయి. పంగలుగా ఏర్పడిన అంచుల్లో బెరళ్ళ తొర్రలు కమండలం ఆకారాన్ని ధరించాయి. మొదళ్ళలో నీడన పడగ ఎత్తిన సర్పం వల్ల భయంతో పరుగెత్తే శుకాలాపాలు చెలగాయి. నీరు లేక ఎండిపోయిన బాల వృక్షాలు చివరి దశలో



నారాయణ స్మరణ చేస్తున్నాయి. ఇలా "గ్రీష్మవని" "వైరాగ్య కేళి" నెరపింది. కాకం వేప పండులోని గింజనూ గుంజునూ పొంది వదలేసిన డొల్లలో పరిత్యక్తభావాన్నీ, నత్త గుల్లలో తత్త్వగుప్తినీ, సాయం సంధ్య ముకుళిత పుష్పాలతో శిరీష వృక్షంలోని బోధనూ, చల్లని చంద్రుడూ వడగాలీ ఒకేసారి రాకతో ద్వంద్వ ప్రబోధాన్నీ రాముడు గ్రహించాడు. మనస్సు నిర్వేదాన్ని పొందింది వైరాగ్య భావంతో నిండింది. "బద్ధ సామజమ"ట్లు క్షోభను పొందాడు. ఏదో మహాకార్యంకై ఉపక్రమించవలసిన అవసరం ఉంది. కాని పైకి తెలియడం లేదు.

"నిలిచి తపించు మౌని జటా వలిం బోలె
కలచె పెన్ తాటి మొవ్వులను గాలి

"తపదిలా దేవతా తను సర్వ రోమాంధు
నిర్గత ధూమ్య నా నెగడె దుమ్ము
మార్తాండ దేవు భ్రూ మధ్య దీప్త జ్యోతి
ఎగచి నట్లుగ మండె నెండ వెలుగు"

వనిలో నిలిచి తపించే మౌని జటావలి వలె గాలికి కదలే తాటి మొవ్వలూ, తపించే భూదేవత శరీరంలో రోమ కూపాల నుండి ధూమంలా ఎగసే దుమ్ము, సూర్య దేవుని కను బొమల మధ్య ప్రకాశించే జ్యోతి ఎగసినట్లు మండే వెలుగూ, చరమ యామినీ దేవి శీర్షాసనం వేసినపుడు క్రిందికి జారే రక్త ప్రసరణంలా 'ఎర్రని బాల సూర్యు'ని తొలి సంజ వెలుగులు దీపించాయి. తపస్సులోని సంతాపం తేజస్సు యోగ నిరతి తో భావనా జగత్తు వైరాగ్య భావంతో తాత్త్విక పార్శ్వాన్ని నిలుపుతూంది.

"లేనివి ఉన్నట్లు"గా కనిపించే స్థితికి తార్కాణంగా ఎండమావులూ, "తెలివి వెలుగు"తో మాయ తొలగుతుందన్న దానికి సాదృశ్యంగా ఎండ కెండిన చెరువులూ, "పైన పటారం లోన లొటార"మన్న దానికి నిరూపణంగా మేడి పండూ, "ప్రాణానికి విరోధి ప్రాణమే" అన్న దానికి ఋజువుగా "వడగాలి", నిజాన్ని బోధిస్తున్నాయి.

భూమి పయి నెరియలూ, పైన నీటి ఆవిరులూ, మును ముందు వచ్చే సస్యాన్నీ దానికి సంస్కార గూఢ బీజాల్నీ భావింప జేస్తున్నాయి. జీవుడూ ఇలాగే తరువాత లభించే ప్రాప్తి యందు కోరికతో చుట్టబడీ కదలి పోవడమూ మెదలుతూంది. నాలుగు సీస పద్యాల్లో నిలువునా నిండుగా పద్య రచనా శిల్పంతో కవిత్వ కళకే మాత్రం భంజకం కాని విధంగా తాత్త్విక ప్రకాశం బింబితమయింది.

ప్రజలు మందు టెండల నుండి అపాయం జరగకుండా జాగ్రత్తగా భయంతో వర్తించడమూ కవి దృష్టిని పొందింది. ఇక సీతా దేవి ముఖం కపోలాలపై రంజితమయిన తారుణ్య రేఖలతో ఎర్రబడింది. ఆమె నిటల తలంపై కస్తూరి రేఖ ద్రవించింది. ఎపుడో కాస్త పడే బట్ట తడుపు వాన జల్లు తాపంతో ఉన్న ప్రజలకు ఆర్ద్రతతో ఊరట నిస్తుంది. మునుముందు ఆశావహమైన స్థితి వ్యంజిత మయింది.

# IV

గ్రీష్మ దృశ్యాల భూమికలో రాముడు తాపాన్ని పొందాడు. వేదనకు గురి అయినాడు. శాంత మనో రూపంకై కుల గురువులు వసిష్ఠ బ్రహ్మర్షిని సమీపిస్తాడు. ఆయన సేవలో తనలో తల ఎత్తిన ప్రశ్నల్ని నివేదిస్తాడు.

"స్వామీ! ప్రాణము కంటె ప్రాణము ధరజాతా ముఖాంభోజమే యేమోగా" కనిపిస్తుందంటాడు, ధరాధిపత్యంలో కలిగే అధిక భావనతోపాటు విషయ వాంఛలూ ఒక్కొక్కటీ గ్రీష్మంలో చిన్న చిన్న జల నిలయాల్లా ఇంకిపోతున్నాయి. చూచిన దానికై కళ్ళు చూడవు. విన్న దానికై చెవులు వినవు! లోపలి ఎదలో తోచీ తోచని దూరమూ దగ్గర కాని దేదో! సందడి! "రాచిన రాపిడై" ఎరుగ రాకుండా ఉంది. అనుగ్రహింప వలసిందిగా కోరతాడు. నిదుర పోయి మేలుకొనీ నిదుర పోయాననీ, నిదుర పోయే వేళ నిదురపోతూ ఉన్నాననీ, అనుకునే అనుభవ స్మృతిని గురించి చెబుతాడు.

"నాటిన కంబ మేనెవరు?
నాయది యన్న విచిత్ర భావమే
చోటిది? అస్మదీయమను
చోద్యపు భావన పాయుటున్నె"?

"నేనెవరు?" "నాది" అన్న విచిత్ర భావ మెక్కడిది? 'నేను' 'నాది' అన్న విచిత్రమయిన భావం పోయే వీలుందా? అపుడు 'నేను' అనే వస్తువు ఏపాటిది? దాని స్వరూప మేమిటి? ఈ సందేహంలో "అవుగాములు" చెప్పి ఏది సరి అయిందో! కాదో! అనుగ్రహించ వలసిందిగా కోరతాడు. ఒక పని చేసేప్పుడు అహంకారాన్ని



వదలి చేసే వీలుందా? అది చేసినట్లే అవుతుందా? అకర్తృక (కర్తృత్వం లేని) కార్యముందా? కర్తను అకర్తను ఒక్క ముడిలో చేర్చగలమా? "ఈ నికరము తేల్చి పెట్టవె? మనీషి శిరః ప్రచలన్మహామణీ!" అది ఎట్లా? విచిత్రమైన ఈ నిర్ణయ రూపాన్ని తేల్చి చెప్పవలసిందిగా అభ్యర్థిస్తాడు.

"ఇంటికి దివ్వె వచ్చినటు లెప్పుడు వచ్చితి నిందు? పూర్వమెం
దుంటిని? ఎట్లు వచ్చితి నహో! యిలు నిర్వెలిగించుకొంచు నీ
వెంటనే పోదునొక్కొ? ఒక వెంబడి నాగునొ? నిత్య యాత్రయో?"

ఇందులో ఉన్న గాఢతరమైన అర్థాన్ని విప్పి చెప్పవలసిందిగా ప్రార్థిస్తాడు. "ఆయాసంబడి పోవుచుంటి గదె! తాతా! నన్ను సైరంపవే!" యనీ తనలో కలిగిన జిజ్ఞాసనూ జ్ఞాన తృష్ణనూ తెలిపి భయ రహితమైన అమృత స్థితినీ నిశ్చల మనోరూపాన్నీ ప్రసాదించవలసిందిగా ఆర్తిలో కనబరుస్తాడు. బ్రహర్షి తేజోమయమైన రూపం నుండి కాంతి ప్రసారానికై ప్రతీక్షిస్తాడు. తనలో వేదనను శాంత పరచి సందేహాన్ని తీర్చే శక్తి ఒక్క వసిష్ఠ మహర్షికే ఉందనీ అతనికి తెలుసు! ఇవి సర్వ జగత్తులో ప్రతి సమాజంలో ఒక్కొక్కరిలో చిరు భేదాలతో తల ఎత్తే ఆలోచనలకు ఎందరో మహానుభావులు వివిధ దశల్లో సమాధానాల్ని కనుగునే ప్రయత్నం చేసారు. ఈ విధంగా వివిధ మార్గాలూ అన్వేషణలూ దర్శనాలూ అనుభవాలూ ఆలోచనలూ లక్ష్యాలు ఏర్పడినాయి. రామునిలో సంపూర్ణమైన మానవ రూపాన్ని ప్రతిఫలింపజేసే ప్రయత్నంలో ఈ ప్రశ్నలు రావడం తాను ఆంతరమయిన సమాధానాలు పొందడం పాత్ర అస్తిత్వం దృష్ట్యా అవసరమైంది. ఇది ఒక స్థాయి. పై స్థాయిలో బ్రహ్మ భావనతో సమాపూర్ణమయిన జ్ఞాన రూపాన్ని కోరడమూ పాత్ర ఆరోహణం దృష్ట్యా అనివార్యమయిందీ. వశిష్ఠుని దివ్యమైన మౌన రూపం నుండే అనుగ్రహం లభించింది. ఉపదేశ ప్రసారాన్ని పొందాడు. వ్యక్తిత్వానికి పూర్ణత లభించింది.

గురువుల్లో ఒకరు విషయం మాత్రం తెలియజేస్తారు. మరొకరు దాన్ని జ్ఞానంతో అనుభవంలోకి వచ్చేట్లు చేస్తారు. ఇంకొకరు విశిష్టంగా తనకు తానుగా తెలుసుకొనే వివేకాన్ని వెలికి తీస్తారు. ఆంతర స్థాయిలో జ్ఞానాన్ని ప్రసరింప జేస్తారు. నిన్ను అడగడమే నా "అదృష్టమ"న్న రామునికి లభించిన ఆత్మ ప్రకాశం వాచ్యం చేయబడలేదు.

# V

ఈ సందర్భంలో గ్రీష్మం బాహ్య దృష్టికి ప్రకృతిలో వచ్చే పరివర్తన రూపంగా తోచినా, ఆంతర దృష్టికి జీవ సంస్కార సంపుటి రూపంలో కలిగే పరితాపంగా సంవేదనగా గోచరిస్తుంది. విరాగ భావనతో అతీతంపై చింతన కవకాశమిచ్చే కాల రూపంగా అవగతమవుతూంది. ఈ విధంగా దృశ్యం ప్రతీకాత్మతను పొందుతూంది.

"మాయా మానుష విగ్రహుం దయిన రామ స్వామి వైరాగ్య రే
ఖా యుక్తిన్ తన యాత్మ తీర్చుకొని గాకన్ సంభవి ష్యన్మహా
క్ష్మా యోషా తనయా వియోగ దహన జ్వాలల్ సహింపంగ నె
ట్లై యుండున్ మరి కేవలత్వపు మనుష్యత్వంబె సంధించినన్ (195)

ఈ పద్యం వ్యాఖ్యాన సమాలోచనంలో అంతర్ భావాన్ని సార్థకం చేస్తుంది. ఇది కథలో అనేక ప్రశ్నలకు ముఖ్యంగా రాబోయే సంఘటనలకు సమన్వయాన్ని సాధించిపెడుతూంది. కథలో పాత్రదిశా నిర్దేశాన్ని సూచిస్తుంది.

రామావతారంలో మాయ చేత కప్పబడిన మానుష రూపం ప్రధానమైంది. కాబట్టి తన నిజ స్వరూపం యొక్క అభిజ్ఞకు వీలు లేదు. ఎపుడో గాఢమైన సమాధి స్థితిలో తోచి అంతలో అదృశ్యం కావడం జరుగుతుంది. ఇక సాధారణ తలంలో గ్రీష్మంలో ప్రభావ దృశ్యాల భూమికతో వైరాగ్య భావనలో తాత్త్వికత, ముందు జరుగ బోయే సీతా వియోగాన్ని సహించే స్థితిని చేకూరుస్తుంది. ఆ శక్తిని కలిగిస్తుంది. ఇది కవి వ్యాఖ్యానం చేత ప్రకాశ మానం చేయబడింది. రాముని పాత్రలో పొరలు పొరలుగా ఏర్పడిన అనేకాంశాల్ని ఒక్కొక్కటీ ఆయా సందర్భాల్లో ఒలిచి చూపడం వ్యాఖ్యాన లక్షణంగా ఉంది.

ఒక సందర్భంలో రాముడు సీతతో

"అల్పమొ వ్రేగొ! బ్రహ్మమను
ఆంతర వస్తువు వీడి నాదు సం
కల్పము నందు సర్వమును
కామిని! నీవుగ నిండి యుంటివీ
కల్పితమైన మోహమను
కాటుక చీకటి చిన్ని దివ్వెవై
శిల్పము వెల్గు గాగ విర
చింతువు! నా హృదయాంతరంబునన్" (266)

ఈ పద్యం బ్రహ్మ నిష్ఠుడయిన రామునిలో సీత పొందిన వీడని స్థానాన్ని గుర్తు చేస్తుంది! ఇదొక విధంగా వెలుగు స్తంభంలా ఉంది. దూరదూరం వెలుగులు ప్రసరించి చీకటిలో ఉన్న ఆ మునుముందు విషయాల్ని కనిపింప జేస్తుంది. మరొక సందర్భంలో

"శ్రీ వశిష్ఠుని సాక్షిగా.... ఆత్మ నిన్ను నిత్యంబుగా హత్తుకొందు" (267) తాత్త్విక ప్రపంచంలోనూ వైరాగ్య భావనలోనూ ఆమెతో భౌతిక మానసిక స్థితుల్ని దాటిన ఆత్మ బంధం సూచితమయింది. సీత పట్ల అనురాగమూ తనలో వైరాగ్య భావమూ గంగా యమునలవలె రామునిలో "సమ ప్రసార" రమ్యాలుగా విలక్షణమైన రూపం పాత్రలో ఆవిష్కృతమయింది. మానుష రూపంలో ఉదాత్త స్థాయిలో ఉత్తమమయిన సమచిత్తాన్ని భావింపజేస్తుంది.

రామాయణ కల్పవృక్షం బాలకాండలో కల్యాణఖండంలో వైరాగ్య భావంలో తాత్త్విక ప్రకాశం వ్యాఖ్యాన భాసుర మయిన కేంద్ర స్థానాన్ని పొందింది. విశ్వనాథ సృజన చేతనలో వ్యాఖ్యాన సుందరమయిన భావన జీవుని అంతిమ లక్ష్యానికి దారి చూపుతూంది.

❖ ❖ ❖

# ౨. లోక హిత ధర్మం
# కైకేయి అంతర్ వ్యక్తిత్వం

ఇది రామాయణ కల్పవృక్షంలో వ్యాఖ్యాన విశిష్టమయిన కేంద్ర స్థానాల్లో రెండోది, రామునిలో ఆంతర ప్రబోధం దీన్ని అనుసరించి, కైక అంతర్వ్యక్తిత్వంతో కీలకమయింది. అయోధ్య కాండలో పట్టాభిషేకానికి ముందు రాత్రి రాముడు ఉపవసించాడు. ప్రాణాయామంలో ఉన్న స్థితిలో ఒక దృశ్యం ప్రత్యక్షమయింది. ఇది సాధారణమైన చూపు కందని విశేష ప్రకాశంతో కథను నడిపించింది. స్వతంత్రమయిన సృజన రూపంగా నిలిచింది. కాలమయమయిన ప్రాణమూ బ్రహ్మ మయమయిన ప్రాణమూ రెండూ తానైన రామచంద్రునిలో సమాధి స్థితిలో దేవతలు కన్పించారు. "దైవత లోక కార్య చరిత వ్రత"యనీ దశావతార మూర్తిని ప్రస్తుతిస్తూ "దేవావలి కంటకాపహరణా!" అని సంబోధిస్తూ రావణ వధకు తన మాటను జ్ఞాపకం చేసారు. దశకంఠుడే మయినట్లు? మా బ్రతుకుల సంగతి ఏమిటి? అని ప్రశ్నించారు. నిష్ఠురోక్తులాడారు. స్వామికి "జ్ఞప్తికి" లేదు. "దయ"కలగడం లేదు, అని నిష్ఠురోక్తులాడారు. తమ పట్ల ప్రసన్న భావం కోసం అభ్యర్థించారు. రాజ్యమేలాలనుకుంటే ఆ తరువాత వేల యేండ్లు ఏల వచ్చునన్నారు. ముందు "ధర్మ రక్షణం, శిష్ట రక్షణం" అవసరమనీ ప్రార్థించారు. దేవతల మాటలతో తాను "అచ్చమైన తెలివి"లో వివర్త రూపంగా భావించాడు. చేతస్సులో "హరి"వలె అనుభూతి పొందాడు. దేవతల మాట తాను జన్మించడంలో ఉద్దేశాన్నీ చేయవలసిన కర్తవ్యాన్ని గురించి దేవతల మాటలతో ఆంతర ప్రబోధాన్ని పొందాడు.

రామునికి "బంధువులు వచ్చి" మాట్లాడినట్లుగా ఉంది. తాను మరచింది, జ్ఞాపకం చేయడానికి వచ్చారు, ధర్మ రక్షణకు ప్రేరేపిస్తున్నారు. మాయా మానుష రూపం కావడం వల్ల విశేష సందర్భంలో జ్ఞాన పథంలో సమాధి స్థితిలో దివ్య భావనలో వెలుగుకు సంబంధించిన దేవతలు కనిపించడం జరిగింది. దీనికి తగిన విధంగా ఉపవాసదీక్షలో ప్రాణాయామస్థితిలో సమాధి సందర్భం యోజిత మయింది.



అంతలో సమాధి సడలింది. ఎక్కువ సేపు నిలవలేదు. ఈ అవతారంలో తాను "విష్ణువు" అన్న ఎరుక ఉండదు. ఎపుడో విశేష స్థితిలో మెరపులా అభిజ్ఞ కలుగుతుంది. ప్రత్యేక సందర్భంలో స్ఫూర్తికి వస్తుంది. మిగతా వేళల్లో మానవుని వలె ప్రవర్తించడం జరుగుతుంది. పైకి స్ఫుటంగా తెలీకుండా లక్ష్యంలో ఆదర్శంలో స్ఫూర్తి సహాయంతో తన జన్మలోని ఉద్దేశాని కనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. అందువల్ల ఈ విశేషమైన అంశాలు వ్యాఖ్యానాన్ని అపేక్షిస్తాయి. కల్పవృక్షంలో ఈ దృశ్యం దేవతల ప్రత్యక్షమై పలికిన మాటలూ ఆ మాటల్లో విష్ణు భావనతో అవతార స్ఫూర్తీ కవితా కృతిని పొందాయి. సమాధి సడలింది. వెంటనే రాముని మనస్సు సీతామయమయింది. రేపు జరుగబోయే రాజ్యాభిషేకానికి సుముఖ మయింది.

> "సీతా ప్రేమము పై మరల్చికొని యెన్ చేతంబు, తచ్చేత మా
> నీతం జై చను రాజ్య కాంక్షకును పూనెన్, లోని బ్రహ్మత్వము
> ద్యోతంబై వెను వెంట రా, నడుమ నేదో వేర ఒక్కండు తా
> నై తో తెంచిన దేవతా విషయమై అంతంత తూగాడుచో" (28)

అయితే లోలోపల బ్రహ్మత్వము ప్రకాశిస్తూనే ఉంది. వీటి మధ్య ఏదో వేరే మరొకటి దేవతా విషయంగా వచ్చినట్లుగా ఉంది. మనస్సు అటూ ఇటూ తూగాడుతూంది, స్పష్టంగా నిశ్చయంగా నిర్ణాయకంగా లేదు. స్పష్టా స్పష్టంగా ఉంది. కాని మనస్సుపై దాని ముద్ర సన్నని వెలుగు గీతలా తనను ప్రేరేపిస్తూంది. సీత పయి "ప్రేమ", దాని వెంట రాజ్యం పయి 'కాంక్ష'తో సాధారణమైన కోరికలకూ బ్రహ్మభావానికీ మధ్య ప్రవేశించగలిగిన శక్తి ఎవరికి ఉంటుంది? రాముని విషయంలో ఒక్క దేవతలకు తప్ప! జ్ఞాపకం వచ్చింది! అది దేవతల విషయం. ఇంత వరకూ అవిదితంగా ఉంది. ఈ విషయమై మనస్సు అటూ ఇటూ ఊగుతూ నిర్ణయానికి రాలేక పోవడం మానవ సహజం! అయితే దేవతలు ప్రత్యక్షంగా కన్పించారు. ధర్మ కార్యానికై అభ్యర్థించారు. రేపు రాజ్యాభిషేక నిర్ణయం జరిగిపోయింది. తాను అందుకీ రాత్రి వ్రత దీక్షనూ వహించాడు. వ్రత దీక్షా సమయంలో సమాధి స్థితిలో ఈ దేవతా విషయం ప్రకాశించింది. అది జ్ఞాన రేఖపై నిలిచింది.

# II

ఆ అర్థ రాత్రం రాముడు మెల్లగా లేచాడు. కైకేయి గృహం వైపు అడుగులు వేసాడు. ఆమె రేపు జరగబోయే అభిషేక వార్త విన్నది, ఆ భావనలో సంతోషంగా ఉంది ఆమె తన మేడకు ముందే నిలిచి ఉంది.

ఆమెను చూచి రాముడు అమ్మా! అని పిలిచాడు. ఆప్యాయంగా 'రమ్మ'న్నది. మనస్సులో ఆ రాత్రి తన వద్దకు వచ్చిన రాముని వ్రత భంగం గురించి భయపడింది. కలత చెందింది.

"చెలువున యౌవ రాజ్య మభిషేక మిదేమిటి? రేపు ప్రొద్దునన్
వెలువడి నీవు సద్వ్రతము వీటను బుచ్చి యిదేమి రాక! లో
కులు నను ఆడి పోసెదరు, కుర్రని సద్వ్రత భంగకారిణిం
బలె! మరి యేమి ముంచు కొని వచ్చిన దీ నడి రాత్రి వేళలో"

రేపు ఉదయం రాజ్యాభిషేకం! నిర్ణీతమయింది. సద్వ్రత నియమాన్ని వదలి ఇలా రావడమేమిటి? లోకులకు తెలిస్తే! ఏమనుకుంటారు? తనను ఆడిపోస్తారు. కుర్రవాని సద్వ్రతభంగం చేసిన దానిగా చూస్తారు. పలు మాటలంటారు. ఇపుడేమి ముంచుకొని వచ్చింది. ఈ నడి రాత్రి వేళలో వచ్చే అవసరమేమి? వచ్చింది. ఈ మాటల్లో తనకు తెలియకుండానే సూక్ష్మంగా తన వల్ల జరగబోయే పట్ట భంగం మాటల్లో చేరింది. లోకులు తనను ఆడి పోసుకునే భవిష్యస్థితీ కదలింది. రేపు ఉదయం తన నుండే విషమ పరిణామం రాముని పైకి ముంచుకొని రాబోతుంది. తన లోపలి ఉద్దేశం ఎవరు గ్రహిస్తారు. స్థూలంగా నింద తనపైనే పడబోతుంది. ఇలా అనుకోకుండా మాటల్లో రాబోయే సంఘటల్నీ పాత్ర చర్యల్నీ సూచించడం కల్పవృక్షంలో చాలా చోట్ల దృష్టికి వస్తుంది.

రాముడు "తల్లీ! వ్రతనిష్ఠలో ఉన్న నాలో సమాధి నిలవలేదు. నేనేమి చేయను?" సమాధి చెదరింది. వ్రతం భగ్నమైనట్లే లెక్క. రేపు మొదలుగా "కట్టి వేయబడిన గజం"లా కదలడానికి వీలు లేదనుకుంటాను.



"అమ్మ! సమాధిలో నిటల మందున వేల్పులు వచ్చిన నన్ను రా
జ్యమ్మును చేయ వద్దనిన యట్లుగ తోచిన నేమి తోచకే
నిమ్మెయి వచ్చితిన్, నిజమదేమియొ! నాకును గూడ నట్లె రా
జ్యమ్మున యందు కోర్కె యను నట్టిది గుండియ బట్టి లేదునున్!!"

తాను రాజ్యం చేయడం దేవతల కిష్టం లేదు. ఇపుడు వారు నన్ను వారిస్తున్నట్లు అనిపిస్తూంది. నాకేమీ తోచ లేదు. ఇది నేను సమాధిలో నున్నపుడు జరిగింది. నాకునూ హృదయంలో రాజ్యం పట్ల కోర్కె లేదు. సమాధిలో అనుకోకుండా జరిగిన దేవతల ప్రత్యక్షం దాని ప్రభావం రామునిలో ఆంతరమైన ప్రభావాన్ని నెరపింది. వారి మాటలకే కట్టుబడి ఉండే అభిప్రాయం కనిపిస్తుంది. మరొకరయితే ఏదో స్వప్నమో స్వప్న తుల్య స్థితిలేక గాఢమైన కల్పన గానో తలచే వారూ, ఆ మాటను మరచిపోయేవారు. ఒక వేళ మరవకపోయినా పైకి తెలియజేసేవారు కారు. ఇది సామాన్యులయిన మనుషుల విషయం. రాముడు అసామాన్యుడు, ధర్మబద్ధుడు, లౌకికమైన వాంఛా విముఖుడుగా దేవతల అభిప్రాయాన్ని మన్నించేవాడుగా కళ్ళ ముందు నిలుస్తాడు. బాలకాండలో కల్యాణఖండంలో గ్రీష్మ ప్రభావంతో కలిగిన వైరాగ్య భావన బీజభూతంగా అతనిలో నిలిచే ఉంది. అది ఇపుడు త్యాగ దిశగా మార్గాన్ని సుగమం చేస్తూంది దేవతా కార్యానికై రాజ్యం వదలి వనవాస వ్యాజంతో తనకు తెలీకుండానే రావణ వధకు ఉపక్రమింప జేస్తూంది.

ఈ మాటలు విన్న కైకేయి వీటిని సామాన్యంగానే తీసుకుంది. ఇంతకంటె ఎక్కువగా ఆపైన ఊహ చేయడం ఆమె పరిధిలో లేదు. ఆమె ఒక సాధనా మాత్రంగానే పని చేసింది. ఇపుడిట్లాగే ఉంటుంది, రేపు జానకితో సింహాసనంపై వేరొక విధంగా ఉంటుందిలే. ఇక వెళ్ళమంది దీనితో రాముని నేత్రాల్లో "ఒక తీవ్ర కళ" ప్రకాశించింది. ఇది కోపానికన్నా తక్కువ స్థాయిలోది. తాను అంగీకరింపలేని భేద దృష్టిని సూచిస్తుంది. కటువైన వాడియైన తీవ్ర దృష్టి కైకేయి మాటలకు అనంగీకారాన్ని ప్రకటిస్తూనే, లోపల దేవతల కార్యంపట్ల సావధానతను తలపుకు తెస్తుంది. రామునిలో దీన్ని అదుపులో ఉంచే విజ్ఞత ఉంది. ఈ మాటలలో స్పష్టం చేయబడింది.

"మున్నీవు ఉవ్వెత్తు నేర్చిన
కోదండ కళా విచిత్ర గమన శ్రీ యేమగున్ చెప్పవే!"

ఈ వాక్యం వాఖ్యాన సుందరతకు నిదర్శనంగా ఉంది. పూర్వం నీవు సునాయాసంగా ఉన్నతంగా సంపూర్ణంగా నేర్చిన ధనుర్విద్యకు సంబంధించిన కళలో ఆశ్చర్యకరమైన పోకడల శోభ ఏం కావాలి? ఆ సమృద్ధిని ఎలా వినియోగం చేయాలి? ఈ మాటలో రాముని ఆంతర్యం స్పష్టం. ఆ సమయం కోసం వేచి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఆమె మాటలకు రాముని నుండి

"కనలున నమ్ములన్ బొమిడికంబున బొమ్మలు చెక్కి కొందునా?
నను నతిజేయ వచ్చిన జనంబుల వ్యూహములన్ పగల్తునా?"

అని సమాధానం వచ్చింది. ఏమీ చేయలేని స్థితిలో కోపంతో కిరీటం పయి శిరస్త్రాణం పయి బొమ్మలు చెక్కుతూ కూర్చోనా? నన్ను నతి చేయడానికి వచ్చే ప్రజలను వ్యూహాల్ని చీల్చడంలో నిమగ్నమయ్యేనా? అని ఎదురు ప్రశ్న వేసాడు. ఆమె ఆశ్చర్యం వేసింది. రాముని వైపు వింతగా చూచింది. వెంటనే, అయితే "నీ ధమవున నున్న చిక్కనైన సుతారాలెందుకో చెప్పమంది. ఆ పని ఏమిటో అతని ముఖతః వినాలనుకున్నది. ఆమె మానసిక స్థాయిని బట్టి వెళ్ళగలిగినంత దూరం వెళ్ళింది. ఆమెకు తెలియకుండానే లోపల నున్న ఆంతర వ్యక్తిత్వంలోని ఉపకరణ విధం వెనక నుండి పని చేస్తుంది. 'తల్లీ! అది కాదమ్మా!' అని ప్రియంగా, తనలో పని చేసే సంప్రేరణ రూపాన్ని స్ఫుటంగా తెలియ జేస్తాడు.

'నేను రాజ్యమ్ము సేయుట నిక్కువముగ
లేదు వేల్పుల కిష్టమ్ము లేదు" అని స్పష్టం చేస్తాడు. సాధారణ స్థాయిలో అభిషేక ప్రయత్నం ఒక విధంగా జరుగుతూంటే, విశేషస్థాయిలో దేవతా ప్రయత్నం మరో విధంగా ఉంది. మొదటిది తత్కాలానికి వెనుక బడి పరిహరణీయం కావచ్చు. రెండోది అపరిహరణీయమవుతుంది. ఒక ఘటన వెనక సాధారణ దృష్టికి కన్పించని కారణాల సంయోజనంతో ఆంతర రూపాన్ని ఆవిష్కరిస్తుంది. దీనికి ముఖ్యంగా



కైకేయి దుష్టమయింది కాకుండా, రామావతార ప్రయోజనాన్ని సార్థం చేసేందుకు లోక హిత స్థాయిలో గొప్ప సాధనంగా ఉపయోగపడింది. కవి వ్యాఖ్యాన మీ దృక్పథంలో సాగింది. ఈ భాగం మాత్రం అత్యంత ప్రధానమైన కీలకస్థానాన్ని వహిస్తుంది ఇది రెండోది. వ్యాఖ్యాన సమాలోచనానికి ప్రాతినిధ్యంగా ఉంది. పట్టభంగం తరువాత వన వాసానికి వెళ్ళే సందర్భంలో తండ్రితో రాముడు పలికిన మాటల్లో కైకేయిని సమర్థిస్తూ ఆమె చర్య విశేషమైన కార్యానికి దోహదం చేసేదిగా పేర్కొబడింది. ఒక మహోపకృతికి రూపంగా భావితమైంది.

"ఈ ధర్మంబును జేయ సాయపడె తానెంతో కృపారాశి యా
సాధున్ నా పిన తల్లి బట్టి కొని ఈ సాధింపులున్ కోపముల్
బాధలో వేల్ బెదిరింపులున్ నిజము నా ప్రాణంబు దుఃఖించెదున్
సాధారణ్యము ధాత్రి బుద్ధియు విశేషం బౌనె యీ నాకునున్"

ఇందులో కైకేయిపట్ల గౌరవ భావమేకాక ప్రశంసావాక్యమూ తన ధర్మ నిర్వహణానికి ఆంతర ప్రేరితమయిన పరిస్థితి విధి నిహితంగా దృష్టికి వస్తుంది. భూమిని పాలించడం సాధారణమయిన విషయం. తానిపుడు విశేష కార్యాన్ని నిర్వహించవలసి ఉంది. ఇది కైకేయి వ్యాజంగా జరిగింది ఇది లోక హితంకరమూ, దేవతా ప్రీతికరమూ తన ఆత్మకు తృప్తికరమూ అయింది. ఈ పద్యం కవి దృష్టిలో, పైకి కనిపించని కారణ యోజనతో వాల్మీకి హృదయానికి వ్యాఖ్యాన భావాన్ని కలిగింది. ఈ విధంగా ఇంకా అక్కడక్కడా కైకేయి గురించి వ్యాఖ్యాన రూపంలో ఆమె అపూర్వ వ్యక్తిత్వం దీని ఆధారంగా వికసిస్తూ పోయింది.

ఈ వ్యాఖ్యాన రచనలో వాల్మీకి కృతిలో వెనుక నున్న బహిర్గతం కాని అంశాల్ని కార్యకారణ సంబంధంతో సంయోజన పరచి తన దైన దృష్టితో స్వతంత్రమయిన రూపంగా ఆవిష్కరించడం ప్రధానంగా ఉంది. ఇది విశ్వనాథ సృజన చేతనలో వ్యాఖ్యాన విశేష గుణంతో కవితా రూపం. కల్పవృక్షం ప్రత్యేకతను నిలుపుతూంది.

❖ ❖ ❖

# 3. హంస ప్రవేశం
# సంశయం - నిస్సంశయం

**(రెండో భాగం)**

రామాయణ కల్పవృక్షంలో యుద్ధ కాండ సంశయ ఖండంలో రాముడు సముద్ర తటాన వానర సేనతో విడిది చేసాడు. ఆ సందర్భంలో హంస ప్రవేశం కవి స్వతంత్రమయిన కల్పనా రూపం. మహా కావ్యంలో తాత్త్వికమైన ప్రకాశంతో వ్యాఖ్యాన విశిష్టంగా కీలకమయిన కేంద్ర స్థానాన్ని పొందింది. ఇది మూడోది. ఈ భాగం ఎనభై పైగా పద్యాలతో ఉదాత్తమయిన సృజన భాగంగా అవతరించింది. రాముని బహిరింద్రియ మయిన కంటికీ అంతరింద్రియ మయిన మనస్సుకూ ప్రియంగా విలసిల్లింది. వేదనతో సంతప్తయై ఉన్న సీతకు శాంతిని ప్రసాదించింది. రావణునికి తాను మరచిన ధర్మాన్ని జ్ఞాపకం చేసింది. దాన్ని అతడు గ్రహించే స్థితిలో లేడు. కారణం అతని మనోరూపం వికార భావనతో కొన్ని పరిమితుల్లో నిలిచి పోయింది.

హంస ప్రాణి రూపంలో సుందరమయిన శక్తి రూపానికి సంకేతంగా ఉంది. రాముని నుండి సీతకు వార్తను అందించడం వరకే పరిమితం కాలేదు. కథలో ముఖ్య పాత్రలయిన అటు సీతపై ఇటు రావణునిపై వేరు వేరు ప్రభావాల్ని నెరపింది. అది వాళ్ళ వాళ్ళ జీవ సంస్కారాల్ని బట్టీ మానసికమయిన స్థాయిన బట్టీ జీవిత లక్ష్యాల్ని బట్టీ అవగతికి వచ్చింది. ఈ అంశం విషయానికి కవిత్వ కళతో పాటుగా ఆంతరమైన తాత్త్విక ప్రకాశాన్నీ చేకూర్చింది. ఇది వ్యాఖ్యాన సమాలోచనానికి ఎంతో అవకాశాన్ని కల్పిస్తూంది.

రాముదున్న స్థితిని గురించి సీతకు వార్తా హరత్వంలో 1) హంసాకృతి విశేషం 2) సందేశం 3) సీతపై ప్రభావం – స్వస్వరూప సంధానం 4) రావణునిపై ప్రభావం సంశయ చలనం 5) అతీతమైన శక్తితో ధర్మానికి సంకేతం అనే అంశాలతో నిర్మాణ ప్రణాళిక రూపొందింది. దీనికిది ప్రత్యేకంగా అధ్యయనం చేయదగిందిగా ఉంది.



వ్యాఖ్యాన రూపంగానే కాక కల్పనా గుణంతో కవి సృజన చేతనకు శాశ్వతమయిన యశో బింబంగానూ ఆకర్షిస్తూంది.

సాయం సంధ్యోపాసనానంతరం శిలాతలంపై కూర్చున్న రామునికి సాగర తీరాన జలాల పయి రాజ హంస కనిపించింది. సాగర జలాలు సంసార సార ప్రసార రూపానికి ప్రతీక. హంస ఉపాధి నాశ్రయించిన ఆత్మ రూపానికి సంకేతం. శాంతి ప్రేరకమయిందీ. ధర్మ సూచకమయిందీ. గుణ వివేచన శీలమయిందీ. మనుషుల మధ్య వార్తా సూత్రంతో చైతన్య ప్రసార సూచకమయిందీ, సుందరమయిన ప్రాణిరూపంగా వెలసిందీ. సీతకు వార్తా హరత్వమనేది ఎవరికి సాధ్యం? పూర్వం "శివాంశయైన "రుద్ర" భావమూర్తి హనుమంతునికి సాధ్యమయింది. ఇపుడు "ప్రభాహర హంసాకృతి"కి సాధ్యమయింది. ఇరువురికీ భేదం ఉంది. హనుమంతుడు రుద్ర భావంతో ఉద్యమించడం జరిగింది. హంస హ్లాద సుందరంగా విలసించడం జరిగింది. 1) ఇది రామునిలో విరహ భావాన్ని మేల్కొల్పింది. ప్రియా సందేశాభిలాషనూ కలిగించింది 2) సీతకు ఆనందాన్ని కలిగించింది. ఇది సాధారణమైంది కాదు. ఆమె గుండెలో అమృత కుల్య ఉబ్బినట్లయింది. చిత్తమనే పద్మం వేయి రేకులు విప్పారినట్లయింది. "తన మోము అద్దం"లో చూచుకున్నట్లుంది. మోదాన్ని కలిగించే సుందర రూపంతో హంస సీతయొక్క ఆత్మను స్పృశించింది. 3) రావణునిలో రాముని గురించి విష్ణు రూప సంశయాన్ని కదలించింది. తన భక్తిలోని శక్తిని గురించీ ఈశ్వరుని కరుణ గురించీ సందేహాన్ని మెరపించింది.

హంస ప్రవేశంతో స్థితి భక్తి బంధాన్నీ భక్త బంధుతనూ దాటింది. ఇది రచనలో పోను పోను నిస్సంశయంలో రావణ వధ సందర్భంలో సుస్పష్టమయింది. రావణునిలో హంసను చూచి వివేకం కలగవలసింది బదులు ఈర్ష్య కోపం విజృంభించాయి. ఇక్కడ మలుపు తిరిగింది. దారి వేరయింది. దీనికి తగిన జీవ సంస్కారం రావణునిలో లేదు. జ్ఞాన లక్షణం లేదు. ఈ మౌలికమైన అంశాలపై రచన మహోన్నతిని పొందింది. ఇందులో కల్పన భావన తాత్త్వికత కవిత్వకళ కలిసి సృజన చేతనలో కవిత్వ స్వరూపాన్ని విశాలతరం చేసింది.

తెలుగు కావ్య ప్రపంచంలో అపూర్వమైందిగా నిలిచింది. ఇది వ్యాఖ్యాన సమాలోచనానికి సంపూర్ణమయిన ప్రాతినిధ్యాన్ని వహిస్తూంది.

## II

హంస బహిరింద్రియ మయిన కంటికీ అంతరింద్రియ మయిన మనస్సుకూ కమనీయంగా అభిలాషా మయంగా ఉంది. రామచంద్రుని హృదయాన్ని ఆకర్షించింది. సీతా వియోగంలో కలిగిన కోరికకూ ప్రేమకూ సుందరమైన ప్రాణి చిహ్నంగా కన్పించింది. కన్ను చెదరిందేమో? యథార్థమా? మాయా? బయటికి కన్పించే ఆకారం నిజమేనా? అన్న విచికిత్సకు లోనయ్యాడు. ఈ సందేహాల వరసలో తెలిసీ తెలియని స్థితి ఏర్పడింది. ఈ స్థితి నుండి పైకి ఉద్గమించి విశేషమైన అనుభవాన్ని పొందాడు. అభిలాషలో ఉత్సుకతలో ఆకర్షణలో హృదయానికి హ్లాద రూపంగా తోచింది. ఆత్మకు సన్నిహితంగానూ అనుభూతమయింది.

జానకీ విరహ వహ్నీ వ్రజ దనాల సంధ్య రెండూ ఒకటిగా తోచాయి. హంస తనలో విరహాన్ని అతిశయింప జేసింది. ప్రేమ మూర్తికి తన వార్తను తెలపాలనీ ప్రియా సందేశం పంపాలనీ మొదట తోచింది. దీనికి అంటే ఈ భావానికి పైన 'హంసాకృతి'లో హర తేజం కనిపించింది. ఆ పైన హరిహర భావన మెరసింది. ఇంకా పైన స్ఫూర్తి మాత్రంగా ఆత్మకు సంకేతమయింది. రెండు రెక్కలూ ముడిచి నిలిచిన స్థితిలో శంఖంలానూ రెక్కలు విప్పి అలలపై సూటిగా ఎగిరినపుడు త్రిశూలంగానూ హరి హర భావనా బింబాన్ని తలపిస్తూంది. తెలుపు శరీరమూ ఎరుపు ముక్కుతో తెల్లని నిప్పులా ఉంది. ఇది అణగిన రజో గుణంతో సత్త్వ గుణ ప్రధాన మయిన శాంతం స్ఫూర్తికి వస్తూంది. శివునిలో ఎఱ్ఱని రుద్ర భావం ఇపుడు తెల్లని శుభ్రమయిన మానసంలో కప్పబడింది. ఇది వేద మార్గంలో పొందిన భావ రూపం. వేదంలో రుద్రుడే ప్రధానంగా కనిపిస్తాడు. ఈ పోలిక ప్రస్తుత సందర్భానికి తగింది. హంస పై కెగిరింది. కంటికి సూటిగా కదిలింది. సముద్ర జలాల పయి అలల్ని కాళ్ళలో మీటుతూ రెక్కలతో తాకుతూ విహరిస్తూంది. చుక్కలు చుక్కలుగా నీరు వదలిస్తూంది. స్వభావోక్తిలో హంస చేష్టలు సుందరగంగా వర్ణితమయినాయి



సంధ్యాకాంతిలో దాసాన పూవు రేకలంత అందంగా రెక్కలార్చింది. ఆర్ద్రమైన చంద్రాశువులుగా మెరసాయి. ఆ హంసను చూస్తే స్థూల దృష్టికి దీర్ఘికల్లో విహరిస్తూ లంకా పట్టణానికి అలంకారంగా తోచింది. సూక్ష్మ దృష్టికి శివుని అహంకార సౌందర్య రేఖ యొక్క చిహ్నంగా తోచింది. అహంకారం దేనికైనా ప్రేరణ స్థానానికి కలిగింది. మనస్సును కర్తృత్వానికి సిద్ధం చేస్తుంది. రాముని విషయంలో ఆహ్లాదకర రూపంతో భౌతికంగానూ మానసికంగానూ సీతకు శాంతిని కలిగించేదిగా భావిత మయింది. రావణుని విషయంలో రాముని గురించి విష్ణు భావ సమర్పకమైన సంశయానికి హేతువవుతూంది.

అతనికి అతడు మరచి వదలేసిన ధర్మాన్ని గుర్తింప జేసేదిగా ఉంది కాని ఆతడంత ఎత్తులో ఆలోచించలేదు. ఇంద్రియ వికార స్వరూప స్థాయిలోనే ఉన్నాడు.

## III

సీతా వియోగ వ్యథతో రాముని శరీరం కృశించింది. హనుమ సీతా విషయం తెలుసుకొని వచ్చి నెలకు పైన గడచింది. అశోక వనంలో ఉందనీ తెలిసింది. ఇపుడు శోక వనంలో ప్రవేశించి ఉంటుంది. కన్నీరు కారుస్తూ ఉంటుంది. ఆమెకు తాను లంకకు చేరిన వార్తను తెలియజేయవలసిందిగా హంసను కోరతాడు. హనుమ రుద్ర భావంతో ఉద్భవించిన మూర్తి. హంస శాంత భావంతో అవతరించిన రూపం. రామునికి హంస బహిరాకృతిలో సుందర రూపంగా కన్పించింది. అంతరాకృతిలో జ్ఞాన బింబంగా గోచరించింది. ఎక్కుపెట్టిన "శార్ఙమో పినాకమో"లా చాచిన రెక్కలతో మింట చరించే హంస, హరిహరాత్మక భావనతో మూల చైతన్యానికి సమీపంగా వర్తిస్తూంది. బంగారు నీరు లాంటి కృపారసం శరీరంపై నుండి క్రిందికి పొంగులుగానూ, రెక్కల అంచుల్లో నుండి ఉంగరాలుగానూ జారుతూంది. దీన్ని చూస్తూ ఉంటే ఆర్తి ఉన్న వారిని దగ్గరికి రమ్మని పిలుస్తూ ఉన్నట్లుంది. పూర్వం ఎపుడో భార్య సహితంగా సేవించినట్లనిపిస్తూంది. ఎపుడయినా హిమగిరి కేగుతూ అయోధ్యా ప్రాంతంలో ఆగావా? అనీ ప్రశ్నిస్తాడు. సాయంకాలం సంజ వెలుగులో ఒక వైపు కాంతి ప్రసరించి సగ మయిన తెల్లని శరీరం ప్రియురాలితో ఇద్దరి వలె

కన్పిస్తూంది. ఇది అర్థనారీశ్వరత్వాన్ని తలపిస్తూంది. హంస రూపంపై నుండి వచ్చే గాలులు "కర్పూర పరిమళాంబువులలో లోలంబుగా" గుప్పుమని అనుభవ పారవశ్యాన్ని కలిగిస్తున్నాయి. స్వర్లోకంలో "అగురు స్రోతసి"లో అభిషిక్తమై వచ్చినట్లుగా ఉంది. ఇది శివాభిషేకాన్ని తలపిస్తూంది. లింగం నిత్య చైతన్యానికి చిహ్నం. హంస దానిలోని జ్ఞానానికి సంకేతమైంది. భావ సాంతత్యం తాత్త్విక శోభ నిస్తూంది.

హంసను చూస్తే కుల గురువులు వసిష్ఠులు తన దగ్గరికి వచ్చేప్పటి మధురిమ అనుభూతమవుతూంది. సీతను చూస్తే ముని ముందుగా తన కాఠిన్యం ఆమె మెత్తదనం తెలుస్తూందనీ ఆమె హృదయ సౌకుమార్యాన్ని సూచిస్తాడు. అందుకే సందేశం పంపడంలో అవసరాన్ని గుర్తించవలసిందిగా కోరడం జరిగింది. తాను జలనిధిని దాటిన విషయం! తెలియజేయవలసిందిగా వినతి చేస్తాడు. పైకి చూస్తే అంతలో బొండు మల్లె పుష్పంలా దిగి, ఇంతలో తెల్ల అవిసె పూవును వీడి, జారిన రేకులాగా, రెక్క విరిసి, కన్పించిన మొదటి అనుభవ దృశ్యం జ్ఞాపకం వస్తుంది.

పార్వతి వంటిది జానకి. ఆమెకు తాను నాథుడు. ఇపుడు అశోకవనంలో వేరుగా ఉంది. ఆమెను హంసగమన యని అనలేదు కాని. హంస గమన మనేది ఆత్మ లక్షణానికి వశమైన వర్తనా రూపంగా భావించడం తాత్త్వికదృష్టి. ఉదాత్తతను పొందుతూంది. ఇక్కడ ఆత్మకు సంకేతంగా లక్షితమయింది. ఇది పరంపరాగతమైందే. వెన్నెలచేత తడిసిన ఆకారం కలిగిన శుభ్రమైన హంసను చూచి, ఆనంద భావాన్ని పొందుతాడు. ఈ దుఃఖ స్థితిలో అతనికి ప్రియా సందేశాన్ని పంపడ మొకటే ముఖ్యమయింది. సందేశం చెబుతూ ఉండగానే వెన్నెలలు దిగాయి.

హంస అందంగా రెక్కల చివర కదలికలో సౌకుమార్య సౌందర్యంతో పైకెగసింది. అది వెళ్ళుతూంటే చిన్న కాల్వగా చేలకు మళ్ళించే గంగా జలధారలా ఉంది. ఇది క్షేత్ర జీవనంలోని మర్యాదను పొందింది. పైకి రింగులుగా ఎగిరి ఆకాశంలో పల్లటీలుగా "బంగారు పూలు తాపిన వెండి 'పళ్ళెం త్రిప్పినట్లు" విహరించింది. ఆకాశానికి కొత్త అందాన్ని తెస్తూ పయనించింది అది పోతూ ఉంటే ఆకాశ గంగ నురుగులతో కొత్త పాయ తీసినట్లు ఉంది. హంస ఆకాశంలోకి ఎగిరి కంటికి కన్పించింది మొదలు చిత్ర విచిత్ర భావ దృశ్యాలు వెలసాయి. ఏదైనా



వస్తువు దూరంగా పోతూ ఉంటే ఆకారం స్వల్పమవుతుంది కాని హంస మాత్రం దూరంలోనూ దగ్గరగా ఉన్నట్లే ఉంది. ఒకే తీరుగా ఒకటే ఆకారంలో రాముని ఎదకు కన్పించింది ఇది ఆత్మ చిహ్నం. ఎప్పుడూ ఒకటిగానే ఉండే, తాత్త్విక స్పర్శను పొందింది.

# IV

సీతకు ఉద్దేశించిన హంసను ముందుగా, సంధ్యా జపం చేసుకొని సౌధాగ్రంపై కూర్చుని ఉన్న రావణుడు చూచాడు. అతని పయి తీవ్ర మయిన ప్రభావాన్ని నెరపింది. అది అక్కడ ఉన్న వారి దృష్టికి రాఘవేశ్వరుని తపస్సు యొక్క సాఫల్యం నుండి పుట్టిన "పూర్ణామృత కుంభ"మో అన్నట్లుగా ఉంది. రావణుడు దాన్ని నిదానించి చూచాడు. ఈ సందర్భంలో "సురవిరోధి" విశేషణం ఔచిత్యాన్ని పొందింది. అతడు దాన్ని నిదానించి చూచాడు. మనస్సులో ఏదో భావం మెదలింది. 'అవును'! 'కాదు'! మధ్య ఉగిసలాడాడు. నిర్ణయానికి రాలేక పోయాడు. కోపం వచ్చింది. తనపై తనకు నమ్మకం పోతూందన్న మాట. ఆ హంస ఎటు వైపు నుండి వచ్చిందో తెలుసుకున్నాడు. అది శ్రీరాముడు సేనతో నిలిచి ఉన్న దిశ కావడంతో ఈర్ష్యతో పాటు క్రోధమూ మనస్సును ఆవహించాయి. "వర్షాం భోదం"లా మెట్లు దిగాడు. చెమటలు పట్టాయన్నమాట. అతని స్వరూపమూ ఆలాంటిదే. తమోగుణ పిహితమయింది. తన దేవాగారానికి వెళ్ళాడు. లోపల చూస్తే కావలిసింది ఎవరో! కన్పించలేదు! తలపంకించాడు. తన భక్తి విశ్వాసాలకు మూలభూతమయిన వాడు! ఇపుడు లేనట్లుంది! నేరుగా సభకు వెళ్ళాడు అక్కడి నుండి విద్యున్మాలితో సీత దగ్గరికి వచ్చాడు! రామలక్ష్మణుల మాయాశిర శరాసనాల్ని చూపి ఇంద్ర జిత్తు చేతిలో వారి వధను ప్రస్తావించాడు. ఈ అంశం మూలలలోనూ ఉంది. ఆమె మూర్ఛ పోయింది కొంత సేపటికి తెలివి వచ్చింది. తనకేదే మాయ క్రమ్మినట్లనిపించింది. రామలక్ష్మణుల మరణాన్ని ఆమె విశ్వసించలేదు. కాని "ఈ కన్నీరు ఎండి పోయేది లేద"నీ దుఃఖించింది.

ఇంతలో ఎదురుగా, బంధువు వచ్చినట్లు రెక్కలార్చుకొంటూ చెట్టు కొమ్మపై "హంసాధ్యక్షుడు" కనిపించాడు. సీతపై హంస నెరపిన ప్రభావం హ్లాదకరమయిందీ. సమాశ్వాస పూర్వక మయిందీ, శాంతి ప్రసాదకమయిందీ. గుండెలో అమృత కుల్య ఉబ్బినట్లయింది. "తన మోమద్దమునందు చూచెనన మోదం చెంత" అంత సంతోషాన్ని పొందింది. ఆమె చిత్తం వికసించింది. హంస దర్శనం ఆమెలో నూత్న చైతన్యాన్నీ కలిగించింది. పూర్వం హనుమంతుడు కూర్చున్న చోటునే హంస కూర్చుంది. రాముని నుండి వార్త తెచ్చిందన్న ఊహ మెదలింది. ఆ ఊహతో శబ్ద సార ప్రసారం అమృతమయంగా వినిపించింది. లంకలోకి రాముడు రావడం తెలిసింది. ధైర్యం ఇనుమడించింది. దుఃఖ కాలం వెళ్ళిపోయే త్రోవ విప్పారినట్లు కనిపించింది. అపుడు కపి, ఇపుడు హంస ఇరువురూ శుభ హేతువులు. మహా దుఃఖ సమయాల్లో తనను ఆదుకున్నవారు. మొదటిది తనలో ఆశకు మొగ్గ తొడిగింది. రెండోది దాన్ని వికసింపజేసింది.

హంస దర్శనం సీతపై మరో గొప్ప ప్రభావాన్ని నెరపింది. ఆమె గాఢ సమాధిని పొందింది. తనలో "ఈశ్వరేశ్వరి", "సనాతని" స్వస్వరూప సంధానం పొందింది. పెదవులపై చిరునవ్వు ఉదయించింది. అది దివ్యమైంది. రావణుడు చూచాడు. అతని చూపులో వెలుగు మందగించింది. గుండె నిలిచినట్లయింది. కోపం వచ్చింది.

దీనికంతా ఈ హంసయే కారణం మనిపించింది. దుఃఖం కలిగింది. లోపల భక్తితో బయటకు క్రోధంతో ప్రవర్తించాడు.

"అంతకునైన కారణము హంసగ తోచెను వాని బుద్ధికిన్
ప్రాంత కుజాగ్ర శాఖపయి వ్రాలిన హంసము నెంచి దుఃఖిత
స్వాంతుడు కోపవంతుడును పట్టగ రాని నిగూఢ భక్తి సం
క్రాంతి బహిఃక్రుధా పరిసరంబుగ ఊహ పొనర్చె నీ గతిన్"

"తనకు బోలె తలలు తరిగి యిచ్చిన వాడు
సృష్టి మొదలు మొదలు చివర దాక
కానరాడు! తన్ను కాదని ఎవనినో
తన్ను బోలు జోగి నెన్ను కొనియె!"

మనసులో కోపంతో చుట్టుకొన్న భక్తి భావన పరి పరి విధాలుగా మాట్లాడించింది. కొత్తగా ఏర్పడిన స్థితి నిష్ఠురోక్తుల్ని పలికించింది.

ఈ సన్నివేశం ఆవేశంలో చెదరిన రావణుని మనస్సుకు అద్దం పడుతూంది. తన స్వామి పట్ల విశ్వాసం సడలింది. అతనిలో దృఢమయిన ఆంతర వ్యక్తిత్వం బీటలు వారింది. తనలాగా తలలు తరిగి ఇచ్చిన వాడు సృష్టి మొదలుగా ఇంత వరకూ ఎవరూ లేరు. భక్తుని కాదని ఎవరినో అంటే రాముని (విష్ణువు) ఎన్నుకొన్నాడు. శివుడు జోగి! రాముడూ వనవాస సందర్భంలో అతని వంటి జోగే!

"ప్రాగల్భ్యం బెసలార రత్నమువలెన్ రాజోపచారంబుగా
సాగింపన్ సుఖ మొప్పగా అనుభవింపంలేక మిన్నేగె"

తాను ఉపచారాలు చేస్తున్నాడు. సుఖంగా గడుస్తూంది. దాన్ని అనుభవింపలేక ఆకాశంలో (హంసయై) ఎగిరిపోయాడు! ఇది రావణునిలో చోటు చేసుకున్న భయాన్నీ తన స్వామి పట్ల అనుమానాన్నీ, రాముని పట్ల సంశయాన్నీ తాను గొప్ప భక్తుడన్న గర్వాన్నీ ధ్వనింపజేస్తూంది. సన్నివేశ రామణీయకతనూ తలపిస్తూంది.

"నాకంటెన్ మునుపైన భక్తుడటె ఈ నాళీక బంధ్వన్వయుం
డా కొన్నాడు శివుండు దంపతుల మధ్యన్ వార్తలందింపగా
క్ష్మాకన్యాపతి యింత దాకను బహిశ్శత్రుండె! ఈనాటి కిం
దాకన్ వచ్చిన యంత కన్పడియె! అంతశ్శత్రుతాస్థానమై"

ఇది వ్యాఖ్యాన సుందర మయిన గొప్ప పద్యాల్లో పేర్కోదగింది. ఇది తాత్త్విక సమాలోచనంలో వివరించ దగిందీ.

ఈ పద్యం ప్రత్యేకించి వ్యాఖ్యాన సమాలోచనం యొక్క అవసరాన్ని గుర్తింపజేస్తూంది. ఈ రాముడు తనకంటె మునుపైన భక్తుడా! శివుడు ఆ దంపతుల మధ్య వార్తలకు ఉద్యుక్తుడయినాడు. ఇంత వరకూ రాముడు బహిశ్శత్రువే! ఇందాకా వచ్చాక తెలిసింది. ఇపుడు అంతశ్శత్రువనీ ఏర్పడింది! సంశయం తొలగే స్థితి ఏర్పడింది.

పూర్తిగా కాదు. ఇవి ఆవేశంలో కోపంతో అన్న మాటలు. ఇంకా అతడు తుది నిర్ణయానికి రావలసి ఉంది. ఇది నిస్సంశయ ఖండంలో జరుగుతుంది.

"నిస్సంశయ" ఖండంలో రామ రావణ ఘోర యుద్ధంలో సమాప్తికి ముందు రోజు, ఆ రాత్రి రావణునిలో ఒక భావం మెదలుతుంది! అది తన మృత్యువు గురించి. ఇది సామాన్యంగా ఏ శక్తికీ సాధ్యం కాని విషయం. ఎవరికీ తెలియని విషయం. రావణుని దృష్టిలో ఇది రాముని పరిధినీ దాటింది. అయితే, ఒక విషయం ఊహను ఆక్రమించింది. తనను వధించడానికి బ్రహ్మకు సంబంధించిన తేజం బ్రహ్మాస్త్రం, పేరుతో ఉన్నది. అది తొలి వికృతి లోని తేజోరూపం, ఇది మహా శక్తివంతమయిందీ, ప్రభావోపేత మయిందీ, వికార లక్షణంతోనే రావణుడు సంహరింపబడతాడు. వికార రూపం వల్లనే సంహరణం వినాశనం విలయం సంభవిస్తాయి సహజమూ సుందరమూ అయిన ప్రకృతి లక్షణంతో సృజన వికాస భద్ర స్థితులు ప్రాప్తిస్తాయి. ఇది ఉపనిషద్విషయం. బహు విధాలుగా ప్రస్తావిత మయింది. అచ్యుతుడూ, దేవి, త్రిశూలియు అందరూ కలిసిన మహా శక్తితో మాత్రమే తన మరణం సాధ్యం. తనలో భక్తి ఎంతటి గాఢమైందయినా, జ్ఞాన మూర్తి ఎంత దగ్గరి వాడయినా, తాను పొందిన శక్తులకన్నా మహనీయ మయింది ఒకటి ఉంది. అది శివుడూ దేవి విష్ణువూ అందరూ "కలిసిన చోటు" రూపం, అన్న స్ఫూర్తి రావణునికి కలిగింది. ఇదే రథ సారథి మాతలికీ కలిగింది. మాతలి మాటపై రాముడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. రాముడెవరో! ఇపుడు రావణునకు తెలిసింది. సంశయం తీరింది. నిస్సంశయం ఏర్పడింది. కల్పవృక్షంలో వాల్మీకంలోని భావం విశేషమయిన వ్యాఖ్యాన రూపాన్ని పొందింది. మూలంలో

"తతః సంస్మారితో రామః తేన వాక్యేన మాతలేః
జగ్రాహ! స శరం దీప్తం.....
బ్రహ్మదత్తం మహాబాణమ్ అమోఘం యుధి వీర్యవాన్"
"వేద ప్రోక్తేన విధినా సంధధే కార్ముకే బలీ"
(యుద్ధకాండ సర్గ (111) శ్లో. 3,4,14")



మాతలి మాటలతో రామునికి బ్రహ్మాస్త్రం జ్ఞాపకం వచ్చింది. ఆ దివ్యమైన స్ఫురణతో అమోఘమయిన దివ్యాస్త్రాన్ని గ్రహించి సంధించాడు. వేద విధి ననుసరించి దాన్ని అభిమంత్రించి ప్రయోగించాడు.

ఇది కల్పవృక్షంలో తొలి వికార రూపంలో తేజస్సు ముఖ్యంగా విష్ణువు దేవి శివుడూ ముగ్గురూ కలిసిన చోటుతో ఏర్పడే మహా దివ్యశక్తిగా వ్యాఖ్యానాన్ని పొందింది. సంశయం నుండి నిస్సంశయానికి దారి తీసిన క్రమమూ తాత్త్విక భావనతో విశ్వనాథ ఉపజ్ఞా మహితమయింది.

హంస ప్రవేశం రామాయణ కల్పవృక్షంలో సందేశం నుండి సంశయం దాకా తాత్త్విక ప్రకాశాన్ని పొందింది. ఇది వాఖ్యాన సమాలోచననాకి అవకాశాన్నిస్తుంది. వ్యాఖ్యాన సమాలోచన మంటే వ్యాఖ్యాన రూపం పయి వ్యాఖ్యానికి సంబంధించిన సమాలోచనమనే గ్రహించాలి.

సమాలోచనం ఎన్ని విధాలయినా తాను చదివినప్పటి లేదా విన్నప్పటి ప్రత్యక్షమైన కావ్యానుభవంతో సమానం కాదు. ఆలోచనకు దారి చూపవచ్చు. అనుభూతికి వెలుగు నివ్వవచ్చు.

రామాయణ కల్పవృక్షంలో సృజన చేతనలో మూడు కథా విషయ కేంద్ర స్థానాల్ని గుర్తించడం జరిగింది. ఈ మహాకావ్యంలో కవితాత్మక మయిన వ్యాఖ్యాన విధంలో కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి స్వతంత్రమయిన ప్రతిభా స్వరూపాన్ని దర్శించడమే ప్రధానోద్దేశం.

❖ ❖ ❖

# మాదిరాజు రంగారావు కృతులు

**A. పరిశోధన – సమాలోచనం**

1. కవిత్రయం సృజనకళ – నిర్వహణ శిల్పం
2. స్వేచ్ఛా కవిత్వం
3. నవల స్వరూపం
4. పరిశోధనా స్వరూపం
5. అధికార భాష
6. అనువాద కళ
7. దాశరథి కవితా సమాలోచనం
8. సమ దర్శనం – స్వేచ్ఛా కవిత్వం
9. ఆలోకనం (సాహిత్య వ్యాసాలు)
10. సృజన దృష్టి – మానవీయ భావన
11. సాహిత్య వ్యాసాలు
12. మహాప్రస్థానం – సమాలోచనం
13. Facets of T. Free-verse
14. సృజన చేతన 1వ భాగం రా. కల్పవృక్షం (తులనాత్మక)
15. సృజన చేతన 2వ భాగం రా. కల్పవృక్షం (వ్యాఖ్యాన)

**B. సృజన – స్వేచ్ఛా కవిత్వం**

16. మానవీయం
17. పడగెత్తిన ఉదయం
18. ముక్తధాత్రి
19. ఇది వియత్నాం
20. యుగ సంకేతం
21. ఆవాహన
22. ముక్తకాలు
23. నాలో ప్రవహిస్తోంది నది
24. నాకు జ్ఞాపకముంది
25. కిర్మీరం
26. మనో భూమికలు
27. వెలుగులో ఈ నేలపై
28. మేల్కొన్న ఈ సమయం
29. శబ్దమయి ప్రాణమై
30. అగ్నిమయం జీవితం
31. కాలాన్ని నిలిపి క్షణం
32. ఈ తరం స్వరచిత్రం
33. అశాంతి ఆర్కెస్ట్రా
34. వర్తమానం స్క్రీన్‌పై
35. అగ్ని నుండి ఆనందానికి
36. జైలు కార్నర్ నుండి
37. ప్రయాణంనుండి ప్రయాణం
38. డైరి దర్పణంలో
39. ఈ శతాబ్ది రెక్కలపై
40. శాంతి స్వప్నం
41. క్రాస్ ఫైర్
42. సీజ్ ఫైర్
43. నేడు రేపు మధ్య
44. కిరణ పథం
45. స్వేచ్ఛకు సిగ్నెల్
46. అభిషేకం
47. ఆగమనం
48. ఎప్పటికీ కొత్తే
49. సృజన దర్శనం
50. మరో వైపు
51. హృదయ మేఘం
52. సమకాలీనం
53. అభినవ యానం
54. ఆత్మ బంధం
55. సృజన మేఘం
56. ఉగ్ర చరణం
57. నవారంభం
58. నవ దర్శనం
59. గిఫ్ట్ ప్యాకెట్
60. పునర్దర్శనం (అస్మిత)
61. నడిచే వెలుగు చుట్టూ (I.P.)